సాక్షి
ప్రకాశం
శుక్రవారం ♦ 28 ♦ జూన్ ♦ 2024



డయేరియాపై జాగ్రత్తగా ఉండాలి

జిల్లాలో వర్షాలు కురుస్తున్న తరుణంలో అతిసారా ప్రబలే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలని డీఎంహెచ్‌వో సురేష్ కుమార్ అన్నారు.

- 8లో..



రోగి బంధువుపై జీజీహెచ్ సిబ్బంది దాడి

చికిత్స కోసం వచ్చిన రోగి బంధువుపై జీజీహెచ్ సిబ్బంది దాడి చేయడం కలకలం సృష్టించింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
33.8/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

బ్యాక్‌లాగ్ పోస్టుల తుది మెరిట్ జాబితా విడుదల

ఒంగోలు సెంట్రల్: 2022–23 సంవత్సర విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక ఉద్యోగాల నియామక తుది జాబితా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ జీ అర్చన తెలిపారు. గ్రూప్–4 టెక్నికల్, క్లాస్–4 పోస్టుల అభ్యర్థుల అభ్యర్థనలు పరిగణలోనికి తీసుకుని తుది జాబితా అభ్యర్థుల పరిశీలనార్థం వైబ్ సైట్‌లో ఉంచినట్లు చెప్పారు. అభ్యర్థులు తమ వివరములకు జాబితా ప్రచురించిన తేదీ నుంచి అనగా 28 నుంచి 30 వరకు మూడు రోజులు వైబ్ సైట్ www.prakasam.ap.gov.in.noticerటాబ్ రిక్రూట్‌మెంట్ ఫోల్డర్‌లో ఉన్నట్లు చెప్పారు.

డీఎల్‌పీవో సస్పెన్షన్



మార్కాపురం: మార్కాపురం డివిజనల్ పంచాయతీ అధికారి జీ నాగేశ్వరరావును సస్పెండ్ చేస్తూ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కే కన్నబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నాగేశ్వరరావు అదే కార్యాలయంలో పనిచేసే మహిళా ఉద్యోగిని పట్ల అనుచితంగా ప్రవర్తించాడని వివిధ పత్రికల్లో వచ్చిన వార్తలపై కలెక్టర్ దినేష్‌కుమార్ విచారణకు ఆదేశించడంతో జిల్లా పంచాయతీ అధికారులు నివేదిక పంపారు. నివేదిక ఆధారంగా డీఎల్‌పీవో నాగేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటికే సీనియర్ అసిస్టెంట్‌ను కలెక్టర్ సస్పెండ్ చేశారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కంట్రోల్ రూం

ఒంగోలు అర్బన్: జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టరేట్ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. తాగునీటి సమస్యలుంటే కంట్రోల్ రూం నంబర్ 91001 21605కు తెలియజేసి పరిష్కరించుకోవచ్చని చెప్పారు.

పట్టు తప్పుతోంది

ఒకప్పుడు సిరులు కురిపించిన పట్టుపరిశ్రమ నేడు రైతులకు నష్టాలు మిగులుస్తోంది. జిల్లాలో మల్బరీ తోటలకు తెగుళ్ల బెడద, నాణ్యమైన గుడ్లు లభించకపోవడంతో దిగుబడులు గణనీయంగా పడిపోతున్నాయి. వరుసగా నష్టాలు వస్తుండటంతో రైతులు మల్బరీ సాగును తొలగించి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లుతున్నారు. ఫలితంగా సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది.

- నాణ్యమైన గుడ్లు లేక ఇక్కట్లు
- వ్యాధులతో వరుసగా పంట నష్టం
- పట్టించుకోని పట్టు పరిశ్రమశాఖ అధికారులు
- మల్బరీ పంటలను తొలగిస్తున్న రైతులు
- జిల్లాలో గణనీయంగా తగ్గిన సాగు విస్తీర్ణం
- మార్కాపురం డివిజన్‌లో 500 ఎకరాలకు పడిపోయిన పట్టుసాగు



మోక్షగుండంలో మూతపడిన పట్టుపురుగుల షెడ్డు

బేస్తవారిపేట: జిల్లాలో పట్టుసాగు గణనీయంగా పడిపోతుంది. గతంలో సీజన్‌తో సంబంధం లేకుండా పట్టు సిరులు కురిపించింది. నేడు పట్టు సాగు పట్ల రైతులు ఆసక్తి చూపించడం లేదు. మల్బరీ సాగు చేస్తున్న రైతులు పంటసాగు చేయలేమంటూ ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. పట్టు సాగు చేసుకునే రైతులు కర్నాటకలోని మైసూర్ నుంచి పట్టు గుడ్లను తెచ్చుకుని చాకీ కట్టుకుంటున్నారు. ఎక్కువ శాతం రైతులు గుడ్లను తెచ్చుకుని చాకీ కేంద్రాల నుంచి మొదటి, రెండో మౌల్ట్ దశలో పురుగులను కొనుగోలు చేసుకుంటున్నారు. బేస్తవారిపేటలో మోక్షగుండం, కంభం మండలంలో సైదాపురంలో చాకీ కేంద్రాలున్నాయి. నాణ్యమైన గుడ్లు రాకపోవడంతో చాకీ కేంద్రాల నుంచి తెచ్చుకున్న పట్టు పురుగులు పట్టు గూళ్లను అల్లడంలేదు. షెడ్డులో పురుగులు వ్యాధుల బారినపడి చనిపోతున్నాయి. ఏడాదిలో నాలుగు–ఐదు పంటలను తీసే రైతులకు ఒక పంట కూడా చేతికి అందని పరిస్థితి. దీంతో పట్టుసాగు చేసే రైతులు నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. పట్టు పరిశ్రమ శాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. సెరీకల్చర్ ఆఫీసర్, అసిస్టెంట్ సెరీకల్చర్ ఆఫీసర్, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అధికారులు పట్టుసాగు చేసే రైతులకు సరైన సలహాలు, సూచనలు ఇచ్చేవారు కరువయ్యారు.

ధర..దిగుబడి తగ్గడంతో...

2022, 2023లో బైవోల్టేన్ పట్టు గూళ్లకు కేజీ రూ.800 ధర పలికింది. నేడు కిలో రూ.500 ధర ఉంటోంది. 100 గుడ్లకు 70–80 కిలోల పట్టుగూళ్లు దిగుబడి వచ్చేది. నేడు వ్యాధులతో 35–40 కిలోల దిగుబడి వస్తోంది. దిగుబడి సగానికి తగ్గి రావడం, ధర తగ్గిపోవడంతో పట్టుసాగు రైతులకు భారంగా మారింది. దీనికితోడు కూలీల ఖర్చు నానాటికీ పెరుగుతుండటంతో పట్టుసాగు చేయలేమంటూ మల్బరీ పంటలను దున్నేస్తున్నారు.

గతంలో రెండు వేల ఎకరాల్లో సాగు:

గతంలో జిల్లాలో రెండు వేల ఎకరాల్లో పట్టుసాగు చేస్తున్నారు. దీనిలో ఎక్కువగా బేస్తవారిపేట, గిద్దలూరు సాంకేతిక సేవా కేంద్రాల పరిధిలో 920 ఎకరాల్లో, దోర్నాల, మార్కాపురం టీఎస్‌సీ పరిధిలో 500 ఎకరాల్లో పంట సాగులో ఉంది. కేంద్ర ప్రభుత్వం పట్టు సాగుకు ప్రోత్సాహకాలు బాగా ఇస్తుండటంతో అధిక సంఖ్యలో రైతులు సాగుచేసేందుకు ముందుకు వచ్చారు.



పెంచికలపాడు పొలంలో తొలగించిన మల్బరీ పంట

నాణ్యమైన పట్టుగూళ్లు రావడం లేదు

మల్బరీ తోటల చుట్టూ మిరప, పత్తి తోటలు ఉండటంతో పురుగు మందులు పిచికారి చేసినప్పుడు మల్బరీ ఆకులపై పడటంతో పురుగులు నాణ్యమైన పట్టుగూళ్లను ఉత్పత్తి చేయడం లేదు. చాకీ కేంద్రాలు లేకపోవడంతో పట్టుసాగు చేసే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీని కోసం గిద్దలూరు మల్బరీ ఫారమ్‌లో చాకీ కేంద్రం ఏర్పాటుకు ఏప్రిల్ నెలలో ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. ఆగస్టు నెలలోపు చాకీ కేంద్రం నుంచి పట్టు పురుగులను రైతులకు సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం.

– సీఆర్ఏ నారాయణరెడ్డి,అసిస్టెంట్ డైరెక్టర్ సెరికల్చర్, మార్కాపురం

కూలీల ఖర్చు పెరిగింది



గత 15 సంవత్సరాలుగా పట్టు సాగు చేస్తున్నాను. కూలీల ఖర్చు పెరిగింది. పండించిన పట్టుగూళ్లకు సరైన ధర పలకడం లేదు. చాకీ కేంద్రాల నుంచి పట్టు పురుగులు తెచ్చుకుంటే వ్యాధులు వస్తున్నాయి. వరుసగా నాలుగు–ఐదు పంటలు నష్టపోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. నష్టాలు ఎక్కువ వస్తుండటంతో మల్బరీ పంటను తొలగించాం.

– మార్తాల వెంకట రమణారెడ్డి, లక్ష్మీపురం.

నష్టాలతో మల్బరీ పంట తొలగించా



పట్టు పురుగులకు వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయి. పట్టు పురుగులు గూళ్లను పెట్టడం లేదు. వరుసగా పంటలు నష్టపోవాల్సి వచ్చింది. దిగుబడి తగ్గి ఖర్చు ఎక్కువ అవుతోంది. నష్టాలు రావడంతో 5 ఎకరాల మల్బరీ పంటను మూడు నెలల క్రితం తొలగించాను. మొక్కజొన్న పంటను నాటుకున్నాను.

– ఆవుల జగదీశ్వరరెడ్డి, మోక్షగుండం

తగ్గిన పట్టుసాగు...

బేస్తవారిపేట మండలంలో మోక్షగుండం, పందిళ్లపల్లె, ఖాజీపురం, పీవీపురం, అక్కపల్లెలో గతంలో 320 ఎకరాల్లో సాగులో ఉండగా నేడు 100 ఎకరాలకు చేరింది. మార్కాపురం డివిజన్‌లో ప్రస్తుతం మల్బరీసాగు 500 ఎకరాలకు పడిపోయింది.

ఘనంగా ఎంఎస్ఎంఈ ప్రపంచ దినోత్సవం



మాట్లాడుతున్న కెనరా బ్యాంకు ఏజీఎం మారుతీ శశిధర్

ఒంగోలు: మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) ప్రపంచ దినోత్సవాన్ని గురువారం స్థానిక లాయర్‌పేటలోని ఐసీఏఐ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కెనరా బ్యాంకు ఏజీఎం బీఎన్ మారుతీ శశిధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఎంఎస్ఎంఈకి సంబంధించిన మార్పులను వివరించారు. ఈ సందర్భంగా పలువురు చార్టెడ్ అకౌంటెంట్లు వ్యక్తం చేసిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ మనోజ్, సీఏ బ్రాంచ్ అధ్యక్షుడు బైసాని జగన్‌మోహన్‌రావు, వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, కార్యదర్శి సౌజన్య, కోశాధికారి కిషోర్, సభ్యులు కూరపాటి సుబ్బారావు, వెంకటేశ్వర్లు, మండవ విజయ్‌కుమార్, రామ్‌ప్రసాద్, రంగనాయకులు, చైతన్యరెడ్డి, శంకరరావు, సత్యన్నారాయణ, అంజిరెడ్డి పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఒంగోలు టౌన్: నూతన చట్టాల అమలు ద్వారా కేసుల దర్యాప్తు, విచారణ పద్ధతుల్లో పెనుమార్పులు వస్తాయని రిటైర్డ్ ఏపీపీ , న్యాయవాది సుంకర సాయిబాబా చెప్పారు. ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలను అందించేందుకు వీలుంటుందన్నారు. అధికారులు, సిబ్బంది కొత్త చట్టాలను పూర్తిగా అధ్యయనం చేయాలని సూచించారు. పోలీసు అధికారులు ప్రతి ఒక్కరూ నూతన చట్టాలపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని, జులై 1వ తేదీ నుంచి అమలులోకి రానున్న నూతన చట్టాలపై జిల్లా పోలీసు అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం (బీఎస్ఏ) చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైం) శ్రీధర్ రావు, డీఎస్పీలు బాల సుందరం, రామరాజు, అశోక్‌వర్ధన్, పోలీస్ లీగల్ అడ్వైజర్ వేణుగోపాల్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే అజెండా



కుటుంబ సభ్యులతో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఏ.తమీమ్ అన్సారియా

- జిల్లా అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తా
- బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రజల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన కలెక్టర్ తమీమ్ అన్సారియా గురువారం ప్రకాశం భవనంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఉన్న కలెక్టర్ దినేష్‌కుమార్ అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన కొత్త కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను క్షేత్రస్థాయి నుంచి పరిశీలించి శాశ్వత పరిష్కార దిశగా పనిచేస్తామన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, ప్రజలు, అధికారులను అందరినీ కలుపుకుని కృషి చేస్తామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు వేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. జిల్లాలో తాగునీరు, ఇతర సమస్యలను క్షేత్రస్థాయిలో అవగాహన చేసుకుని పరిష్కరిస్తానన్నారు. విద్య, వైద్యం, పారిశుధ్యం, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ఒంగోలు, కనిగిరి ఆర్‌డీవోలు సుబ్బారెడ్డి, జాన్ ఇర్విన్, జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాలు, కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు, కలెక్టరేట్ ఉద్యోగులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. బుధవారం రాత్రి ఒంగోలు చేరుకున్న తమీమ్ అన్సారియాను ఎన్ఎస్‌పీ అతిథి గృహం వద్ద ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, ఇతర అధికారులు స్వాగతం పలికారు. కలెక్టర్‌తో పాటు ఆమె భర్త శ్రీకాకుళం కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, కుటుంబ సభ్యులు ఉన్నారు.



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

నూతన కలెక్టర్‌కు మాజీ మంత్రి సురేష్ శుభాకాంక్షలు

సింగరాయకొండ: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తమీమ్ అన్సారియాకు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సురేష్ జిల్లా సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యంగా వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలని, ఇందు కోసం తక్షణమే వెయ్యి కోట్ల రూపాయల నిధులు విడుదల చేయాలన్నారు. రాబోయే వర్షాకాలంలో వర్షపు నీటితో రిజర్వాయర్ నింపాలని కోరారు. కొండపి నియోజకవర్గం జరుగుమల్లి మండలంలో సతుకుపాడు, కామేపల్లి, చింతలపాలెం, జరుగుమల్లి, కే బిట్రగుంట ఇసుక రీచ్‌లలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ప్రతిరోజు వందలాదిగా ట్రాక్టర్లు, జేసీబీలతో లక్షలాది రూపాయల ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారన్నారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలని, రాత్రి పూట గస్తీ పెంచాలని, రీచ్‌ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గంలో ఎన్నికల కౌంటింగ్ పూర్తయినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై టీడీపీ సానుభూతిపరులు వ్యక్తిగత దాడులు చేయటమే కాక, ఆస్తులు ధ్వంసం చేశారని దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా దోషులపై వెంటనే కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకుల ఆస్తులకు, ప్రాణాలకు భద్రత కల్పించాలని, దీనికి సంబంధించి పూర్తి ఆధారాలతో వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యలపై కలెక్టర్ తమీమ్ అన్సారియా సానుకూలంగా స్పందించారని సురేష్ తెలిపారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఎస్పీ గరుడ్‌సుమిత్ సునీల్‌ను కలిసి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై జరిగిన దాడులను వివరించి చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరామని, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరామని దీనిపై ఎస్పీ కూడా సానుకూలంగా స్పందించారని ఆయన వివరించారు.



కలెక్టరు తమీమ్ అన్సారియాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ మంత్రి సురేష్



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ



సమావేశంలో పాల్గొన్న ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు

ఫిర్యాదులపై జాప్యం చేయవద్దు

- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ సుమిత్ సునీల్

ఒంగోలు టౌన్: బాధిత ప్రజల పట్ల జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, వేగవంతంగా చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ సూచించారు. ప్రజా ఫిర్యాదులను పరిష్కరించడానికి పోలీసు అధికారులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, విధుల్లో నిజాయితీగా, పారదర్శకంగా, జవాబుదారితనంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ కేసుల్లో సాధించిన పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఆయా కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు పలు సూచనలు చేశారు. వివిధ కేసుల్లో నిందితుల అరెస్టులు, చార్జిషీటు దాఖలు, సమన్లు, నాన్ బెయిలబుల్ వారంట్లను పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన కేసులు, ఎన్డీపీఎస్, లోక్ అదాలత్, రౌడీషీట్లు, రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన కేసులను సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పోలీసు స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమష్టి కృషి, సమన్వయంతో పనిచేయడం వలన సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సమస్యలు తలెత్తకుండా పనిచేయగలిగామని చెప్పారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించిన పోలీసు అధికారులను పేరుపేరునా అభినందించారు. అదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 29వ తేదీ జరిగే లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులను లిస్టును తయారు చేయాలని, కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలని చెప్పారు.

పోలీసు అధికారులకు ప్రశంస పత్రాలు

ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించిన ఏఎస్పీ (క్రైం) ఎస్‌వీ శ్రీధర్ రావు, ఏఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, డీఎస్పీలు రామరాజు, అశోక్ వర్ధన్, బాల సుందరం, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్‌తో పాటు పలువురు సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బందికి ప్రత్యేక ప్రశంస పత్రాలు అందజేశారు. అలాగే అర్ధవీడు పోలీసు స్టేషన్‌ల పరిధిలో జరిగిన హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష పడటంలో కీలకపాత్ర పోషించిన కంభం సీఐ రామకోటయ్య, అర్ధవీడు ఎస్ఐ యం.అనిత, పొదిలి ఎస్ఐ కోటయ్య, అర్ధవీడు కానిస్టేబుల్ లక్ష్మి నాయక్, అర్ధవీడు పీఎస్ హోంగార్డు నాగరాజులను అభినందించిన ఎస్పీ ప్రశంస పత్రాలు అందజేశారు. సమావేశంలో ఏఎస్పీలు, డీఎస్పీలు, పోలీసు లీగల్ సెల్ అడ్వైజర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు భూ సేకరణ పూర్తి చేయాలి

- జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: జిల్లాలో వివిధ జాతీయ రహదారుల నిర్మాణాలకు భూ సేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. భూ సేకరణ ప్రక్రియపై గురువారం ప్రకాశం భవనంలో సమావేశం నిర్వహించారు. ఎన్‌హెచ్ 565, 216, 544, 167(బీ), 765, 544 తదితర జాతీయ రహదారుల నిర్మాణాలకు నిర్దేశించిన భూ సేకరణను లక్ష్యాల మేరకు పూర్తి చేయాలన్నారు. పెండింగ్ క్లెయిమ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, కనిగిరి ఆర్డీఓ జాన్ ఎర్విన్, తహసీల్దార్లు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న జేసీ గోపాలకృష్ణ

30న అండర్ 19 బాలబాలికలకు చెస్ పోటీలు

ఒంగోలు: స్థానిక కొప్పోలు రోడ్డులోని నెక్స్‌ట్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూలులో ఈ నెల 30న చదరంగ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి షేక్ అబ్దుల్ నబీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన మొదటి నలుగురికి రాష్ట్రస్థాయి చదరంగ పోటీలకు పంపుతామన్నారు. 2005 తరువాత పుట్టిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాలకు 9666725719 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వివాదాస్పద భూమిపై ఇరువర్గాలకు నోటీసులు

కొండపి(సింగరాయకొండ): మండలంలోని పెట్లూరు గ్రామ సర్వే నెంబర్ 450లో 4.40 ఎకరాల భూమికి సంబంధించి సెక్షన్ 145 కింద నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్‌లో కల్లూరి చెంచురామయ్య, శ్రీనివాసరావు, హరిబాబు, ఇతరులు తమ భూమిని కొందరు ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తున్నారని ఇచ్చిన అర్జీపై గత శనివారం విచారణ చేపట్టామన్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేశామని తెలిపారు. భూమికి సంబంధించి 2012లో కందుకూరు కోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేసిందని, సంబంధిత పత్రాలను కూడా ఉన్నతాధికారులకు అందించినట్లు చెప్పారు. కోర్టు స్టేటస్ కో ఇచ్చినందున జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ ఆదేశాల మేరకు సెక్షన్ 145 కింద ఆ భూమిలోకి ఎవరూ ప్రవేశించకుండా నోటీసులు జారీ చేశామన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూ వివాదం నేపథ్యంలో గ్రామంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కొండపి ఎస్సైకి సూచించారు.

విద్యార్థులు 28 లోగా పాఠశాలల్లో చేరాలి

ఒంగోలు: విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు 3వ విడత లాటరీలో జిల్లాలో 10 మంది విద్యార్థులు ఒకటో తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించారని సమగ్రశిక్ష ప్రకాశం జిల్లా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డి.సుభద్ర గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరిలో ఎస్సీ విద్యార్థులు 7గురు, బీసీ విద్యార్థులు ముగ్గురు అర్హత సాధించారన్నారు. వీరంతా ఎన్నుకున్న పాఠశాలలో ఈనెల 28వ తేదీలోగా సంబంధిత ధృవపత్రాలతో చేరాలన్నారు. మండల స్థాయి అభ్యంతరాలు ఈ నెల 29న ఎంఈఓలు పరిష్కరిస్తారని, ఎంఈఓల నుంచి డీఈఓ వద్దకు వచ్చిన అభ్యంతరాలను ఈనెల 30న డీఈఓ పరిష్కరిస్తామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా వచ్చే అభ్యంతరాలను రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ సమక్షంలో జూలై 1న పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

మార్కాపురం: ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మార్కాపురంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ కథనం మేరకు.. మార్కాపురం పట్టణంలోని పదో వార్డుకు చెందిన కాలువ పెద్ద నాగార్జున(30) కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పెద్దనాగార్జున మృతి చెందినట్లు ఎస్సై గురువారం రాత్రి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

డయేరియాపై జాగ్రత్తగా ఉండాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ సురేష్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సురేష్‌కుమార్

ఒంగోలు టౌన్: జిల్లాలో వర్షాలు కురుస్తున్న తరుణంలో అతిసారా ప్రబలే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు తగిన జాగ్రత చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రభుత్వ అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది సూచించిన నివారణ పద్ధతులను పాటించాలన్నారు. సురక్షితమైన మంచినీరు మాత్రమే తాగాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు సబ్బుతో కడుక్కోవాలని, విధిగా మరుగుదొడ్లను ఉపయోగించాలని సూచించారు. తల్లిపాలు తాగే శిశువులకు అతిసార సోకితే తల్లి పాలు ఇవ్వడం మానివేయకూడదన్నారు. తగినంత పోషకాహారం, అనుబంధ ఆహారం ఇవ్వాలని తెలిపారు. విరేచనాలు అవుతుంటే ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా పంపిణీ చేసే ఓఆర్ఎస్ వినియోగించాలని, ఒక లీటర్ తాగు నీటిలో ఒక పాకెట్ ఓఆర్ఎస్‌ను కలిపి విరేచనమైన ప్రతిసారి ఈ ద్రావణాన్ని సేవించాలన్నారు. ఈ ద్రావణాన్ని కలిపిన 24 గంటలలోగా ఉపయోగించాల్సి ఉంటుందన్నారు. రోజు మొత్తంలో అనేక సార్లు నీళ్ల విరేచనాలు కావడం, విరేచనాలతో పాటుగా వాంతులు కావడం, శిశువులు తల్లిపాలు తాగలేక మగతగా ఉండడం, కొన్నిసార్లు విరేచనాలతో పాటుగా జ్వరం రావడం, చర్మం మడతలు పడడం ప్రమాదకర లక్షణాలుగా గుర్తించాలని, వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి తక్షణ వైద్యం ప్రారంభించాలని తెలిపారు. అతిసార వ్యాధి నివారణ, సహాయం కోసం జిల్లా వైద్యారోగ్య కార్యాలయంలో అత్యవసర విభాగాన్ని ఏర్పాటు చేశామని, ఇది 24 గంటలు పనిచేస్తుందన్నారు. ఏదైనా సమస్య ఉంటే 9515324799కు ఫోన్ చేసి తగిన వైద్య సహాయాన్ని పొందాలని కోరారు.

గిద్దలూరు రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ అన్నారు. స్థానిక అర్బన్ కాలనీలోని సచివాయంలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో కురుస్తున్న వర్షాల కారంగా అతిసార వ్యాధి ప్రబలుతుందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ అధికారులు సిబ్బంది సూచించిన నిబంధనలు పాటించాలని ఆయన కోరారు. సుభ్రమైన సురక్షితమైన నీటిని తాగాలన్నారు. మరుగుదొడ్లను వాడిన తరువాత చేతులను శుభ్రంగా కడుక్కొని ఇతర వ్యవహారాలు చేసుకోవాలన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచి పంపిణీ చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రజలను వ్యాధులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంచాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ విభాగంలో అత్యవసర విభాగాన్ని 24 గంటలు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ షరీఫ్, డాక్టర్ భార్గవ్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు సుధారాణి, ఖాశింబీ,ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అభినందనల వెల్లువ



కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న జేసీ గోపాలకృష్ణ,



వీఆర్‌ఓ సంఘ నాయకులు



రెవెన్యూ అసోసియేషన్ నాయకులు



ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నాయకులు

ఒంగోలు అర్బన్:

జిల్లా కలెక్టర్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన తమీమ్ అన్సారియాకు జిల్లా అధికారులు, ఉద్యోగులతో పాటు ఉద్యోగ, కార్మిక, కుల సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోలీసు అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సీపీఓ వెంకటేశ్వర్లు, దివ్యాంగుల శాఖ ఏడీ అర్చన, డీఎంహెచ్ఓ సురేష్, డీఈఓ సుభద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, సర్వే అండ్ ల్యాండ్ ఏడీ కిషోర్, జిల్లా వీఆర్‌ఓ సంఘం అధ్యక్షుడు వైపీ రంగయ్య, ప్రధాన కార్యదర్శి ఏసీ ఆదిరెడ్డి, ట్రెజరర్ జానయ్య, రవికుమార్, రమణి, వినీల, వెంకట రమణయ్య, రమేష్, వాసంతి, ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి రవి కుమార్, మసూద్ అలీ, రంగారెడ్డి, మానస, శ్రీదేవి, శ్రీనివాసులు, సురేష్, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, కలెక్టరేట్ అధ్యక్షుడు ఊతకోలు శ్రీనివాసరావు, ఇతర అధికారులు, ఉద్యోగులు ఉన్నారు.

రోగి బంధువుపై జీజీహెచ్ సిబ్బంది దాడి

- హడలిపోయిన డయాలసిస్ యూనిట్‌లోని రోగులు
- లిఫ్టులో వీల్ చైర్ తగలడంతో మొదలైన వివాదం





జీజీహెచ్‌లోని డయాలసిస్ సెంటర్లో రోగి భార్యపై దాడి చేస్తున్న సిబ్బంది

ఒంగోలు టౌన్: చికిత్స కోసం వచ్చిన రోగి బంధువుపై ఒంగోలు జీజీహెచ్ సిబ్బంది దాడి చేయడం కలకలం సృష్టించింది. ఒంగోలు నగరంలోని కేశవరాజుకుంటకు చెందిన ఒక వ్యక్తి గత కొన్నేళ్లుగా కిడ్నీ సమస్యతో బాధ పడుతున్నారు. జీజీహెచ్‌లోని డయాలసిస్ సెంటర్‌లో చికిత్స డయాలసిస్ చేయించుకుంటున్నారు. సదరు రోగికి 4 రోజుల క్రితం గుండె నొప్పి రావడంతో జీజీహెచ్‌లోని మూడో అంతస్తులో అడ్మిట్ అయ్యారు. గురువారం డయాలసిస్ చేయించుకునేందుకు వీల్ చైర్‌లో గ్రౌండ్ ఫ్లోర్ ఉన్న డయాలసిస్ యూనిట్ వద్దకు బయలుదేరారు. ఆ సమయంలో అక్కడ ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓలు అందుబాటులో లేకపోవడంతో రోగి భార్య స్వయంగా వీల్ చైర్‌లో కూర్చోబెట్టుకుని తీసుకెళుతున్నారు. లిఫ్టులో వెళ్తున్న క్రమంలో పారిశుధ్య సిబ్బందికి వీల్ చైర్ తగిలింది. ఈ విషయంలో సిబ్బందికి రోగి భార్యకు మధ్య జరిగిన వాదన ఘర్షణకు దారితీసింది. లిఫ్టులోనే ఇరువురి మధ్య ఘర్షణ జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. కాసేపటి తర్వాత లిఫ్టు గ్రౌండ్ ఫ్లోర్‌కు చేరుకోగానే ఎవరిదారిన వెళ్లిపోయారు. లిఫ్టులో జరిగిన ఘర్షణను తోటి సిబ్బందికి చెప్పడంతో ఆగ్రహానికి గురైన జీజీహెచ్ సిబ్బంది డయాలసిస్ యూనిట్‌లో ఉన్న రోగి భార్యను బయటకులాగి మూకుమ్మడిగా దాడికి దిగారు. ఆమె మీద పిడి గుద్దులు కురిపించారు. దీంతో డయాలసిస్ యూనిట్‌లో చికిత్స పొందుతున్న రోగులు భయాందోళనకు గురయ్యారు. తన మీద దాడి జరిగిన విషయాన్ని బాధిత మహిళ డిప్యూటీ సూపరెండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. దాడి చేసిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా జీజీహెచ్‌లో మూక దాడి ఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పారిశుధ్య సిబ్బంది తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. జీజీహెచ్‌లో ఇలాంటి ఘర్షణలు నిత్యకృత్యమయ్యాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

> **షోకాజ్ నోటీసు ఇచ్చాం**
>
> డయాలసిస్ యూనిట్‌లో ఉన్న రోగి భార్యపై పారిశుధ్య సిబ్బంది దాడి చేసినట్లు ఫిర్యాదు అందింది. సూపరింటెండెంట్‌కు, ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చాం. ఈ విషయంపై వివరణ కోరుతూ పారిశుధ్య కార్మికులకు షోకాజ్ నోటీసు జారీ చేశాం. విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటాం.
>
> – డాక్టర్ బాలాజీ నాయక్, డిప్యూటీ సూపరింటెండెంట్, జీజీహెచ్

పొగాకు గరిష్ట ధర కేజీ రూ.360

- టుబాకో బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు వెల్లడి



పొదిలిలో వేలానికి వచ్చిన బేళ్లు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధర గురువారం గరిష్ఠంగా కేజీ రూ. 360 ధర పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో గురువారం నిర్వహించిన వేలానికి 7924 బేళ్లు రాగా 7332 కొనుగోలయ్యాయని, వ్యాపారులు వివిధ కారణాలతో 592 బేళ్లు తిరస్కరించినట్లు వివరించారు. ఫిబ్రవరి 29న మొదలైన ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 91వ రోజు వేలం సాగుతోందని చెప్పారు. ఈ కేంద్రాల్లో 4984 బేళ్లు రాగా వ్యాపారులు 4638 కొనుగోలు చేశారని, 346 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారని చెప్పారు. గరిష్ట ధర కేజీ రూ.360, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.256.67 పలికిందని చెప్పారు. అదే విధంగా మార్చి 6న ప్రారంభమైన డీసీ పల్లి, కలిగిరి, కందుకూరు-2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 86వ రోజు వేలం సాగుతోందని చెప్పారు. ఆయా కేంద్రాల్లో 2940 బేళ్లు రాగా 2694 బేళ్లు కొనుగోలయ్యాయని, వ్యాపారులు వివిధ కారణాలతో 246 బేళ్లు తిరస్కరించినట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో గరిష్ట ధర రూ.360, కనిష్ట ధర రూ.204, సరాసరి ధర రూ.247.81 పలికిందన్నారు.

నగరంలో ట్రాఫిక్ సమస్యపై విస్తృత తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

ఒంగోలు టౌన్: నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన నేర సమీక్ష అనంతరం నగరంలోని 24 ప్రధాన కూడళ్ల వద్ద పోలీసు అధికారులు, సిబ్బంది విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను సమర్థవంతంగా ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఈ తనిఖీల్లో హెల్మెట్, వాహనాలకు సంబంధించిన పత్రాలు, ట్రిబుల్ రైడింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారు, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ తదితర రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఈ-చలానాల ద్వారా జరిమానాలు విధించినట్లు చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో ఏఎస్పీ అడ్మిన్ కే నాగేశ్వరరావు, ఏఎస్పీ క్రైం శ్రీధర్‌రావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు



క్షతగాత్రులను 108లో తరలిస్తున్న దృశ్యం.



ప్రమాదానికి గురైన ఇంటర్‌సిటీ బస్సు.



గాయపడిన వ్యక్తిని మరో బస్సులో తీసుకెళుతున్న బంధువులు

- ముందులారీని ఢీకొట్టి పొలాల్లోకి
- అతివేగంతోనే ప్రమాదం
- ఎనిమిది మందికి గాయాలు.
- చాగల్లు-వీరేపల్లి మధ్య ఘటన

ఉలవపాడు: అతివేగంగా వెళుతున్న ఇంటర్‌సిటీ ట్రావెల్స్ బస్సు ముందు వెళుతున్న లారీని ఢీకొట్టి అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన మండల పరిధిలోని చాగల్లు-వీరేపల్లి మధ్య జరిగింది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నుంచి చెన్నైకు 30 మంది ప్రయాణికులతో ఇంటర్‌సిటీ వాల్వో బస్సు బుధవారం రాత్రి బయలుదేరింది. ఉదయం 5 గంటల సమయంలో చాగల్లు దాటిన తరువాత ముందు వెళుతున్న లారీని ఢీకొట్టి పొలంలోకి దూసుకెళ్లి ఆగిపోయింది. ముందు లారీ ఢీకొట్టిన వేగానికి ముందు వెళుతున్న మరో లారీని స్వల్పంగా ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సు డ్రైవర్ మల్లారెడ్డి ఇరుక్కుని పోవడంతో హైవే సిబ్బంది వచ్చి బయటకు తీశారు. బస్సులో ప్రయాణిస్తున్న లక్ష్మిరెడ్డి, వెంకటగణేష్, సత్య, నారాయణ, మణి, శేషగిరి, ప్రియలకు గాయాలయ్యాయి. వీరిని 108, హైవే అంబులెన్స్‌లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. మిగిలిన ప్రయాణికులు వేర్వేరు ట్రావెల్స్ బస్సుల్లో వెళ్లిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలల న్యాయ చట్టం క్షేత్ర స్థాయిలో అమలు చేయాలి

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి
- జిల్లా శిశు సంక్షేమ కార్యాలయంలో సమీక్ష



సమీక్షలో పాల్గొన్న అధికారులు

ఒంగోలు సెంట్రల్: బాలల న్యాయ చట్టం క్షేత్ర స్థాయిలో అమలయ్యేలా చూడటం అందరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి పేర్కొన్నారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో గురువారం ఒంగోలు డీఎస్పీ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి మాట్లాడుతూ.. ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల్లో ప్రస్తుతం ఎంత మంది చిల్డ్రన్ నీడ్ కేర్ అండ్ ప్రొటెక్షన్(సీఎన్‌సీపీ) పిల్లలు ఉన్నారు, ఎంత మంది నాన్ సీఎన్‌సీపీ పిల్లలు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. సీఎన్‌సీపీ కింద 93, నాన్ సీఎన్‌సీపీ కింద 115 మంది పిల్లలు ఉన్నట్లు సిబ్బంది చెప్పారు. బాల సదన్‌లో నూతన అడ్మిషన్స్ ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. రిమ్స్ వైద్యశాలలో 25 రోజుల క్రితం వదిలేసిన శిశువుకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం అయినందున బాలల న్యాయ చట్టంను అనుసరించి త్వరితగతిన ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలని చెప్పారు. డీఎస్పీ కిషోర్ కుమార్ మాట్లాడుతూ బాలల న్యాయం చట్టంలో భాగంగా నమోదైన మిస్సింగ్ చిల్డ్రన్, అబాండెడ్ చైల్డ్ ఎఫ్ఐఆర్ వివరాలు తెలియజేస్తే త్వరితగతిన పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ కమిటీ సభ్యులు నీలిమ వంశీలత, సీడీపీఓ కేవీపీ రాజకుమారి, డీపీవో బాల ప్రభాకర్, డీసీపీఓ పి.దినేష్ కుమార్, బాలల సంరక్షణ అధికారి శేఖర్‌బాబు, లీగల్ కమ్ ప్రొటెక్షన్ అధికారి ప్రభాకర్, ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు జీవితం, శిశుగృహ మెనేజర్ రఫా హరియాట్, ఖాసిం పాల్గొన్నారు.